ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
గురువారం 2 అక్టోబరు 2025

అమ్మో.. పాము!

- గ్రామీణ ప్రాంతాల్లోనే అధిక కేసులు నమోదు
- మంత్రాల జోలికి వెళ్లొద్దు
- చికిత్స అందిస్తేనే ప్రాణాలకు భరోసా

6

అమ్మో.. పాము..!

ఈ ఏడాది ఇప్పటికే 67మందికి కాటు

వానాకాలం సీజన్‌లోనే 41 మందికి..

మంత్రాల జోలికి వెళ్లొద్దు

చికిత్స అందిస్తేనే ప్రాణాలకు భరోసా

మెదక్ పట్టణానికి సమీపంలోని చిట్యాలకు చెందిన ఓ రైతు పొలంలో చెరుకు గెడలు నరుకుతుండగా.. పాము కాటు వేసింది. మొదట చిన్నగానే అనిపించినా కాసేపటికి వాపు పెరిగి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబసభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించడంతో ప్రాణం దక్కింది.

రేగోడ్ మండలంలో ఓ గృహిణి రాత్రివేళ వంటగదిలో బియ్యం సంచి తీయడానికి వెళ్తుండగా పాము కాటు వేసింది. సమయానికి పీహెచ్సీలో వైద్యులు యాంటీవీనమ్ ఇంజక్షన్ ఇవ్వగా ప్రాణాపాయం తప్పింది.

మెదక్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సుమారు నెల రోజులుగా వరుస వర్షాలు కురుస్తున్నాయి. దీంతోపాటే పాముకాటు కేసులూ పెరుగుతున్నాయి. మెదక్ జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 67 మంది పాముకాటుకు గురయ్యారు. ఒక్క వానాకాలం సీజన్‌లోనే 41 మంది పాముకాటు బారిన పడ్డారు. ఇవన్నీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో రికార్డు అయిన కేసులే. ఇక ప్రైవేట్ ఆసుపత్రుల్లో, ఇతర మార్గాల్లో వైద్యం చేయించుకున్న ఘటనలు అదనం. వర్షాల కారణంగా ఇళ్లలోకి పాములు చేరడంతో పాటు రైతులు వ్యవసాయ భూములకు వెళ్తున్న క్రమంలో పాముకాటుకు గురవుతున్నాయి. వైద్యులు చెబుతున్న దాన్ని బట్టి పాముకాటు కేసులు ఎక్కువగా జూలై-సెప్టెంబరు నెలల్లోనే అధికంగా ఉంటాయి. రాత్రిపూట టార్చిలైటు లేకుండా బయటకు వెళ్లడం, వర్షం కారణంగా తడినేలపై నిర్లక్ష్యంగా నడవడం, పాడి గేదెల పాకల దగ్గర జాగ్రత్తలు తీసుకోకపోవడం తదితర కారణాల వల్ల ప్రధానంగా పాముకాటుకు గురవుతున్నారు. పాముకాటుకు గురైతే ఇంట్లో చిట్కాలు పాటించడం, మంత్రగాళ్ల వద్దకు వెళ్లడం చేయకుండా ఆస్పత్రికి తీసుకురావాలని వైద్యులు సూచిస్తున్నారు.



జాగ్రత్తలు పాటించాలి

పాముకాటు కేసులు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో నమోదవుతున్నాయి. పొలాల్లో గడ్డి వాముల్లో, పాడి గేదెల పాకల్లో పాములు ఎక్కువగా ఆశ్రయం పొందుతుంటాయి. వర్షాల కారణంగా బయటకు రావడంతో ఇళ్లలోకి కూడా జొరబడుతున్నాయి. నిర్లక్ష్యంగా ఉంటే పాముకాటుకు గురయ్యే అవకాశం ఉంది. రాత్రివేళ టార్చిలైటు లేకుండా బయటకు వెళ్లరాదు. పొలాల్లో పనిచేసే సమయంలో పాదరక్షలు తప్పనిసరిగా వేసుకోవాలి. గడ్డి రాశులు, పాకలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. పిల్లలకు జాగ్రత్తలు సూచించాలి. పాముకాటు వేస్తే మంత్రాల జోలికి వెళ్లకుండా తక్షణమే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రితో పాటు అన్ని ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాలలో యాంటీవీనమ్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. సమయానికి వస్తే వందశాతం ప్రాణరక్షణ సాధ్యం.

- డాక్టర్ హరిప్రసాద్, డీఎంహెచ్ఓ కార్యాలయ ఏఓ

ఎల్లాపూర్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేత

పాపన్నపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మంజీరా ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని ఎల్లాపూర్ బ్రిడ్జిని తాకుతూ ప్రవహిస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. బ్రిడ్జిపై రాకపోకలు ఆపేసిన అధికారులు పాపన్నపేట వైపు టాపర్లు పెట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఏడుపాయల వనదుర్గ ఆలయం ఎదుట ప్రవాహాన్ని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పరిశీలించారు. ఘనపురం ఆనకట్టపై నుంచి భారీగా నీరు వస్తోందని, ప్రజలు లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. ఆయన వెంట ఎస్సై శ్రీనివాస్ గౌడ్, పోలీసులు ఉన్నారు.



ఎల్లాపూర్ బ్రిడ్జి మూసివేస్తూ ఏర్పాటు చేసిన టాపర్లు

గాంధీ ఆస్పత్రి నుంచి రోగి సహాయకురాలి అదృశ్యం

బౌద్ధనగర్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి నుంచి రోగి సహాయరాలు అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా బురుపల్లె గ్రామానికి చెందిన భూమమ్మ(50) తన కుమారుడిని కాలికి ప్లాస్టిక్ సర్జరీ నిమిత్తం పది హేనుల క్రితం గాంధీ ఆస్పత్రిలో చేర్పించింది. కుమారుడికి భూమమ్మ సహాయకురాలిగా ఉంది. సెప్టెంబరు 28వ తేదీన ఉదయం పదిన్నర గంటల సమయంలో భూమమ్మ ఎవ్వరికి చెప్పకుండా గాంధీ ఆస్పత్రి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం కుటుంబ సభ్యులు, బంధువులు పలుచోట్ల వెతికినా ఫలితం లేదు. దీంతో కుమార్తె గులకంట భవ్య తన తల్లి కనిపించటం లేదని మంగళవారం రాత్రి పోలీసలకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



భూమమ్మ (ఫైల్

అద్భుతం.. అమ్మ

ఓ ఉపాధ్యాయుడి చిత్రలేఖనం

మనోహరాబాద్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బ్రహ్మచారి విజయదశమి సందర్భంగా కాగితంపై దుర్గామాత చిత్రాన్ని గీశారు. రంగుల్లో గీసిన ఈ చిత్రం ఆకట్టుకుంటోంది.





(రోడ్డు ప్రమాదంలో చక్రాల కింద నలిగిన డ్రైవర్

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

తూప్రాన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): లారీ టైరు పేలడంతో దానిని మార్చేందుకు ప్రయత్నిస్తున్న డ్రైవర్‌ను మరో లారీ వేగంగా వచ్చి ఢీ కొనడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి తూప్రాన్ పట్టణ హైవే బైపాస్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న లారీ తూప్రాన్ పట్టణ శివారులో హైవే బైపాస్‌లో నర్సాపూర్ బ్రిడ్జీ వద్దకు రాగానే ముందు టైర్ పేలిపోయింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ ఎండీ నసీమ్ (40) లారీ పక్కకు నిలిపి టైర్ మార్చేందుకు జాకీ ఎక్కిస్తున్నాడు. అదే సమయంలో వెనుకగా వస్తున్న మరో కంటైనర్ లారీ వేగంగా వచ్చి నసీమ్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో నసీమ్ లారీ చక్రాల కింద ఇరుక్కుని అక్కడిక్కడే మృతి చెందాడు. ఢీకొన్న లారీ డ్రైవర్ హిమాన్షు పాల్ (24), క్లీనర్ నిర్భయ్ యాదవ్ (21)లు గాయపడ్డారు. లారీ యజమాని ఆస్లామ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

● ఒకరి పరిస్థితి విషమం





తీవ్ర గాయాలపాలైన శివ, రమేష్

చేగుంట, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి): కారు, బైక్ ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన చేగుంట మండలం ఉల్లి తిమ్మాయపల్లి గ్రామ శివారులోని కమాన్ వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అనంతసాగర్ గ్రామానికి చెందిన మేకల రమేష్, మేకల శివ చేగుంట నుంచి బైక్ పై అనంతసాగర్ వస్తుండగా ఇబ్రహీంపూర్ నుంచి చేగుంట వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. రమేష్‌కు తలకు గాయాలు కాగా, మేకల శివకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు చేగుంట ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన కారు

గుండ్రెడ్డిపల్లి అడవిలో చిరుత సంచారం



గుండుపై సేద తీరుతున్న పులి

తూప్రాన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్రెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో చిరుత సంచారం కలకలం రేగింది. గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్, దాతర్‌పల్లి గ్రామాల శివారుల్లోని ఆటవీ ప్రాంతంలో మూడు రోజులుగా చిరుత కనిపిస్తున్నట్లు గ్రామస్తులు వివరించారు. బుధవారం సాయంత్రం అటవీ ప్రాంతంలో గుండుపై చిరుత సేదతీరడం చూసినట్లు తెలిపారు. గతంలో మాచిన్‌పల్లి అటవీప్రాంతంలో చిరుతను గుర్తించారు. అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు తెలియడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అయితే, గతం నుంచే ఇక్కడ చిరుత సంచారం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఓం ప్రకాశ్ సూచించారు.

గుండెపోటుతో క్రికెటర్ మృతి

మెదక్ అర్బన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో యువ క్రికెటర్ మృతి చెందిన ఘటన బుధవారం మెదక్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నవాబుపేటకు చెందిన సాయికిశోర్(28)కు బుధవారం ఉదయం ఇంట్లో ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే కుప్పకూలిపోయాడు. సాయికిశోర్ జిల్లా, రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ఆల్‌రౌండర్‌గా ప్రతిభ కనబరిచేవాడని తోటి క్రీడాకారులు పేర్కొన్నారు. మృతుని భార్య భాగ్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



సాయికిశోర్(ఫైల్)

వైద్యులసమయపాలనపై ప్రత్యేక నిఘా

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

సంగారెడ్డి డీసీహెచ్ఎస్ డా. షేక్ మహ్మద్ షరీఫ్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సంగారెడ్డి అర్బన్, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది, ఉద్యోగుల విధులపై ప్రత్యేక నిఘా ఉంచామని, విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త(డీసీహెచ్ఎస్) డా.షేక్ మహ్మద్ షరీఫ్ హెచ్చరించారు. ఇటీవల డీసీహెచ్ఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న : ఏరియా, సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో కొందరు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదనే విమర్శలపై ఏ విధంగా స్పందిస్తారు?

జవాబు: డ్యూటీ రోస్టర్ ప్రకారం ప్రతి డాక్టర్, వైద్య సిబ్బంది వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిబద్ధతతో పనిచేయాలి. సంతకాలు చేసి డ్యూటీ మధ్యలో వెళ్లిపోతే సహించేది లేదు. ఫిర్యాదులు రాకుండా పారదర్శకంగా అకింతభావంతో పనిచేయాలి. అక్టోబరు 1 నుంచి డాక్టర్లతో పాటు అన్ని కేడర్ల సిబ్బంది, ఉద్యోగులకు ఆధార్‌బేస్డ్ అటెండెన్స్ పక్కాగా అమలు చేస్తాం.

ప్రశ్న : రోగుల పట్ల డాక్టర్లు, సిబ్బంది అమర్యాద, దుర్భాషలాడుతున్నట్టు వస్తున్న ఆరోపణలపై మీరిచ్చే ఆదేశాలేమిటి?

జవాబు: ఆస్పత్రులకు వచ్చే రోగుల పట్ల డాక్టర్లు, వైద్య సిబ్బంది స్నేహపూర్వకంగా, మర్యాదగా వ్యవహరించాలి. రోగులకు అర్థమయ్యేలా సమాధానాలు, సూచనలు, సలహాలివ్వాలి. రోగుల పట్ల అజాగ్రత్తగా వ్యవహరించొద్దు. వైద్య సేవలందించే విషయంలో ఆవేశాలు, ఆగ్రహాలు, దుర్భాషలు పనికిరావు.

ప్రశ్న: రోగులు, గర్భిణులను చిన్నాచితక కారణాలతో ఏరియా, సీహెచ్‌సీల నుంచి జిల్లా ఆస్పత్రి, హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

జవాబు: టీవీవీపీ ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది పరిధికి లోబడి పనిచేయాలి. కేసు తీవ్రతను బట్టి ఎక్కడి కేసులు అక్కడే వైద్య సేవలందించాలి. చిన్నాచితక అనారోగ్య కారణాలను పెద్దగా చూపి రెఫర్ చేయవద్దు. పరిస్థితి తీవ్రంగా ఉండి మన వద్ద కానీ పక్షంలో తప్పా అకారణంగా కేసులు రెఫర్ చేసి రోగులు, గర్భిణులను ఇబ్బందులకు గురిచెయ్యొద్దు.

ప్రశ్న : టీవీవీపీ ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది, మందుల కొరత ఉందా?

జవాబు: ప్రస్తుతానికి డాక్టర్లు, సిబ్బంది సరిపడా ఉన్నారు. లేనిచోట తాత్కాలికంగా సర్దుబాటు చేస్తున్నాం. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. కొరత ఏమీ లేదు.

వైభవంగా సద్దుల బతుకమ్మ
● ఉత్సాహంగా ఆడిపాడిన యువతులు, మహిళలు 9



● మహిషాసుర మర్దినిగా..

కొండపాక మండలం మర్పడగలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం విజయదుర్గామాత మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. అష్టోత్తర శత సువాసినులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించి 108 కిలోలు ఒడి బియ్యం సమర్పించారు.

- కొండపాక, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి)

చిన్నకోడూరులో రైల్వేస్టేషన్

● ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. దసరా సందర్భంగా ఈ శుభవార్త తెలిపినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. సిద్దిపేట జిల్లా ప్రజలకు ఎంపీ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.


వర్షాలకు గుంతలమయంగా మారిన రహదారి

సమస్యల హాల్ట్

● రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో భారీ వాహనాలు
● ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు
● పట్టణ ప్రజలకూ కష్టాలే.. 8


చేర్యాల పట్టణంలోని గాంధీచౌక్

మహాత్మా.. మన్నించు!

● జాతీయ రహదారి విస్తరణ, కల్వర్టు నిర్మాణం కారణంగా గాంధీ విగ్రహం తొలగింపు

● ముసుగుతో మునిసిపల్ కార్యాలయ ఆవరణలో విగ్రహం

చేర్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): యేటా గాంధీ జయంతి, వర్ధంతి సందర్భంగా చేర్యాలలోని గాంధీ చౌక్ వద్ద గల జాతిపిత విగ్రహానికి రాజకీయ నాయకులు, అధికారులు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించేవారు. కొన్నాళ్ల క్రితం జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా ఈ విగ్రహాన్ని తొలగించారు.


మునిసిపల్ కార్యాలయ ఆవరణలో ముసుగులో ఉన్న గాంధీ విగ్రహం

ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో విగ్రహానికి ముసుగు కప్పేసి ఉంది. నేడు గాంధీ జయంతి నేపథ్యంలో, ఈ ఏడాది నివాళులర్పించే కార్యక్రమాన్ని ఎక్కడ, ఎలా నిర్వహించాలనే విషయంపై సందిగ్ధం నెలకొంది.

1988లో జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారిపై చేర్యాల నుంచి కడవేరుగు గ్రామానికి వెళ్లే మలుపు వద్ద, ప్రగతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. జనగామ నుంచి దుద్దెడ వరకు జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కుడిచెరువులోకి వరద నీటిని మళ్లించేందుకు వీలుగా కల్వర్టును ఎత్తు పెంచుతూ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఈ పనుల కారణంగా గాంధీ విగ్రహం రహదారి మధ్యలోకి రావడంతో, గత సంవత్సరం డిసెంబరులో దాన్ని తొలగించి మునిసిపల్ కార్యాలయానికి తరలించారు. గాంధీచౌక్ వద్ద అనువైన స్థలం లేకపోవడంతో తొలగించిన విగ్రహాన్ని మరెక్కడ నెలకొల్పుతారన్నది ఇంకా తేలలేదు. కల్వర్టు పనులు నత్తనడకన సాగుతుండటం, విగ్రహం మునిసిపల్ కార్యాలయం ఆవరణకే పరిమితం కావడం చూస్తుంటే గాంధీచౌక్‌కు పునర్వైభవం కలుగుతుందా, లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో ఎన్‌హెచ్ (జాతీయ రహదారి) అధికారుల నిర్లక్ష్యంతో పాటు, మునిసిపల్ అధికారుల పట్టింపులేనితనంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విజయీభవ

● నేడు విజయదశమి ● రావణ దహనానికి ఏర్పాట్లు ● బందోబస్తు చేపట్టనున్న పోలీసులు
● ముస్తాబైన ఆలయాలు ● నర్సాపూర్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ ● పండుగపై గాంధీ జయంతి ఎఫెక్ట్!


రంగధాంపల్లి వద్ద రావణదహనానికి ఏర్పాట్లు

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ నేడు. దేశమంతటా ఎంతో ఉత్సాహంగా జరుపుకునే ఈ పర్వదినాన సిద్దిపేటలో రావణ దహనం సహా పలు వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిద్దిపేటకల్చరల్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): రావణుడిపై శ్రీరామచంద్రుడు సాధించిన విజయానికి సంకేతంగా దసరా జరుపుకుంటారని, అందులో భాగంగానే రావణ దహనం చేస్తారని పురాణాలు చెబుతున్నాయి. వనవాసం వెళ్లిన పాండవులు తిరిగి వచ్చేటప్పుడు విజయదశమి రోజున జమ్మిచెట్టుపై దాచిన తమ ఆయుధాలను తీసుకున్నారని కూడా ఒక కథ ప్రచారంలో ఉంది. ఈ పండుగ రోజున కొత్త దుస్తులు ధరించి, పాలపిట్టను చూశాక, జమ్మిచెట్టుకు పూజలు చేసి జమ్మిని (బంగారం) సేకరిస్తారు. బంధువులకు, స్నేహితులకు జమ్మి పంచుతూ అలయ్ బలయ్ తీసుకుని పరస్పరం పండుగ శుభాకాంక్షలు

మిగతా 8వ పేజీలో

నేడు రామ్‌లీలా కార్యక్రమం

● హాజరుకానున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : దసరా సందర్భంగా గురువారం సాయంత్రం హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు వద్ద రామ్‌లీలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారు. అలాగే పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం, శివాలయం వద్ద దసరా సందర్భంగా జరిగే జమ్మి పూజలో పాల్గొననున్నారు.


హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

ఎన్నికల నిబంధనలకు లోబడే

ఖర్చు చేయాలి

● కలెక్టర్ హైమావతి


● రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశం

సిద్దిపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో, ఎన్నికల నిబంధనలకు లోబడి మాత్రమే ఖర్చు చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి స్పష్టం చేశారు. ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అధికారులకు అందించాలని సూచించారు. నిబంధనల అమలులో పకడ్బందీగా వ్యవహరిస్తామని తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో, అధికారులతో ఆమె వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎన్నికల్లో ఉపయోగించే అన్ని రకాల సామగ్రి, భోజనం, వాహనాలు, షామియానా ఇతర అన్ని రకాల వాటికి సంబంధించిన ధరలను ఖరారు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని నిక్కచ్చిగా, పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

నిబంధనల మేరకు అనుమతులు

రాజకీయ పార్టీల ప్రతినిధులు ర్యాలీలు, సభలు, ప్రచారాలు నిబంధనల ప్రకారం, ఎన్నికల ప్రవర్తనా

మిగతా 8వ పేజీలో



సమస్యల హాల్ట్

- రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో భారీ వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు
- పట్టణ ప్రజలకూ కష్టాలే..

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట వాసుల రైల్వే కల తీరినా.. రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రైల్వేస్టేషన్ పట్టణానికి దూరంగా ఉండటం ఓ సమస్య అయితే, ఆ దారిలో భారీ వాహనాల రాకపోకలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సిద్దిపేట నుంచి వివిధ రాష్ట్రాలకు బియ్యం ఎగుమతి అవుతుంటాయి. అలాగే, జిల్లాకు అవసరమైన యూరియా వివిధ రాష్ట్రాల నుంచి సిద్దిపేటకు దిగుమతి అవుతుంది. ఇతరత్రా సరుకు రవాణ కోసం కొత్తగా ఏర్పడ్డ రైల్వేస్టేషన్ నుంచి గూడ్స్ రైళ్ల ద్వారా జరుగుతున్నంది. ఈ నేపథ్యంలో ఈ మార్గం గుండా భారీ వాహనాల రాకపోకలు పెరిగాయి. ఇక్కడ రోడ్డు కేవలం 30 ఫీట్లు మాత్రమే ఉండటం.. వందలాది వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలిచి ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం భారీ వాహనాల తిరగటం వలను ప్రమాదాలు జరుతాయని ఆందోళనకు గురువుతున్నారు. లోడ్ లారీలు వచ్చి వెళ్తుండటంతో రోడ్లు కూడా దెబ్బతిని, గుంతలు పడుతున్నాయి. రైల్వే స్టేషన్ సమీపంలోని గుండ్ల చెరువు కాలనీ కోసం గతంలో సర్వీస్ రోడ్డు మంజూరైనప్పటికి కూడా ఇంకా పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో రాజీవ్ రహదారి నుంచి నేరుగా రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ప్రత్యేకంగా దారి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇక పట్టణం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. స్టేషన్‌లో రైలు దిగిన తర్వాత కూడా పట్టణంలోకి వచ్చేందుకు వాహనాలు అందుబాటులో ఉండక జనం ఇబ్బందులు పడుతున్నారు.


గుంతలమయంగా మారిన రహదారి


సిద్దిపేట రైల్వే స్టేషన్


కాలనీ నుంచి వెళ్తున్న భారీ వాహనాలు

బతుకమ్మ ఆడేందుకు స్థలం లేక..

గతంలో కాలనీ కూడలి వద్ద రోడ్డు మీద స్థానికులు బతుకమ్మలు పెట్టి ఆడుకునేవారు. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు దెబ్బతినటంతో ఈ సంవత్సరం స్థానికుల చొరవతో కాలనీలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో ప్లాట్ చదును చేసి అక్కడ బతుకమ్మ ఏర్పాట్లు చేశారు. కాలనీకి దూరంగా వెంచర్ ఉండటంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రత్యేక రోడ్డు వేయాలి

గుండ్లచెరువు కాలనీ నుంచి భారీ వాహనాలు వెళ్లకుండా చూడాలి. ఈ వాహనాల కోసం ప్రత్యేకంగా రోడ్డు ఏర్పాటు చేయాలి. కాలనీవాసులు పట్టణానికి వెళ్లడానికి తారు రోడ్డు వేయాలి. భారీ వాహనాల రాకపోకల వల్ల ఏదైనా ప్రమాదం జరుగుతుందని ఆందోళన పడాల్సి వస్తున్నది. పిల్లలు బయటకు వస్తే భయం అవుతుంది.

- చెరుకు దేవరాజు, అవుల రవికూమార్,
గుండ్ల చెరువు కాలనీ





విజయీభవ

(7వ పేజీ తరువాయి)

తెలియజేసుకుంటారు. సాయంత్రం జరిగే రావణ దహన కార్యక్రమంలో పెద్ద ఎత్తున జనాలు పాల్గొంటారు.

సిద్దిపేటలో ఏర్పాట్లు

గురువారం జరిగే దసరా వేడుకలకు సిద్దిపేటలో నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని రంగాధాంపల్లి చౌరస్తా, నర్సాపూర్, రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా, ఎన్సాన్‌పల్లిలలో రావణ దహనం కోసం ఏర్పాట్లు చేశారు. లైటింగ్, బారికెడ్లు ఏర్పాటు చేశారు. దసరా సందర్భంగా నిర్వహించే రావణ దహనాన్ని చూసేందుకు సిద్దిపేట వాసులే కాకుండా, చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా జనాలు తరలివస్తారు. ముఖ్యంగా, నర్సాపూర్‌లో జరిగే వేడుకలు వినూత్నంగా ఉంటాయి. మిగితా చోట్ల పాలపిట్టను ఎగురవేస్తే, నర్సాపూర్‌లో రావణ దహనంతో పాటుగా జాతీయ జెండాను ఎగురవేస్తారు. చాల ఏళ్లగా వస్తున్న ఈ సంప్రదాయంలో. జాతీయ జెండా ఆవిష్కరణ తర్వాతే గ్రామప్రజలు జమ్మికి వెళ్తారు. ఈ సంవత్సరం కూడా జెండా ఆవిష్కరణ, రావణ దహనం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలీసుల బందోబస్తు


దసరా వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. పండుగ వేళ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రోడ్డుపై స్టాపర్స్ ఏర్పాటు చేయనున్నారు. వేడుకలకు వచ్చే ప్రజలు పోలీసులకు సహకరించి పండుగ సజావుగా సాగేలా చూడాలని కోరారు. దసరా, గాంధీజయంతి ఒకే రోజు రావడంతో మద్యం, మాంసం విక్రయాలు ప్రభావం పడింది. కొందరు ముందుగానే మద్యం కొనుగోలు చేసి పెట్టుకున్నారు.


నర్సాపూర్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ (ఫైల్)


సిద్దిపేటలోని ఓ వైన్స్ వద్ద రద్దీ

సిద్దిపేట అభివృద్ధి స్పీడ్ బ్రేకర్ తాత్కాలికమే: హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అభివృద్ధికి స్పీడ్ బ్రేకర్ తాత్కాలికమేనని, మళ్లీ మొదలైతే దూసుకపోవటమేనని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శరన్నావరాత్రుల సందర్భంగా సిద్దిపేట పట్టణంలో పలు మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవార్లను బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ సిద్దిపేటలో అన్నింటినీ అభివృద్ధి చేసుకున్నామని చెప్పారు. దసరా సందర్భంగా జిల్లా వాసులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.























ఎన్నికల నిబంధనలకు లోబడే ఖర్చు చేయాలి

(7వ పేజీ తరువాయి)

నియమావళికి లోబడి ముందస్తు అనుమతి తీసుకొని నిర్వహించుకోవాలని కలెక్టర్ కోరారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో ఒక ప్రత్యేక బ్యాంకు అకౌంట్‌ను అందజేయాలని, ఆ అకౌంట్ ద్వారా మాత్రమే ఎన్నికల్లో ఖర్చు చేయాలని సూచించారు. నామినేషన్ సమయంలో అభ్యర్థితో కలిపి ముగ్గురికి మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏమి చేయాలో, ఏమి చేయకూడదో నిఘా బృందాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించకుండా పర్యవేక్షించేందుకు ఎంసీసీ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.


మాట్లాడుతున్న ఇర్రి రాజిరెడ్డి

విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

మద్దూరు, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సేవా దృక్పథంతో పాటు క్రమశిక్షణ గల విద్యాభ్యాసాన్ని కొనసాగించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సొసైటీ వైస్‌చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లద్నూరులో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్ అధ్యక్షతన జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శీతాకాల శిబిరం ముగింపు సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరి క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసంతో పాటు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం శ్రమదానం చేసిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మనర్సయ్య, శ్రీనివాస్‌రాజ్, ప్రతికంఠం రామ్మూర్తి, సిద్దిరాములు, బాలసిద్దయ్య, మాలు, నవీన్ మాజీ సర్పంచ్ సుదర్శన్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.











వైభవంగా సద్దుల బతుకమ్మ


సిద్దిపేట రూరల్ : లక్ష్మీదేవిపల్లిలో ప్రధాన కూడలి వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


తొగుట గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మిరుదొడ్డి: ధర్మారంలో బతుకమ్మలతో మహిళలు


మిరుదొడ్డి మండలం జంగాపల్లి గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సద్దుల బతుకమ్మ సంబరం బుధవారం జిల్లాలోని పలు మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని మహిళలు రంగురంగుల పూలను కోసుకుని వచ్చి ఇంట్లో బతుకమ్మను అందంగా పేర్చారు. ఈసందర్భంగా మహిళలు బతుకమ్మ ఆటపాటలతో వివిధ కూడళ్ల వద్ద బతుకమ్మ ఆటలను ఆడారు. దీంతో గ్రామాలు నూతన శోభను సంతరించుకున్నాయి. అనంతరం చెరువుల్లో బతుకమ్మను నిమజ్జనం చేశారు.

-దౌల్తాబాద్/మిరుదొడ్డి/సిద్దిపేట రూరల్/తొగుట/వర్గల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి)

దౌల్తాబాద్: గాజులపల్లి ఎస్సీ కమ్యూనిటీ భవన ముందు బతుకమ్మలు ఆడుతున్న మహిళలు




వర్గల్ మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ వేడుకలు

నీట్ ఫలితాల్లో ఇమాంబాద్ విద్యార్థిని సత్తా


ముత్యాల చతుర యాదవ్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణ పరిధిలోని ఇమాంబాద్‌కు చెందిన ముత్యాల తిరుపతి యాదవ్, తారకరత్న దంపతుల కూతురు చతుర యాదవ్ నీట్ ఫలితాల్లో సత్తా చాటింది. 92శాతానికి పైగా మార్కులు సాధించి సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉచితంగా సీటు దక్కించుకుంది. ఈ సందర్భంగా చతుర మాట్లాడుతూ ఎంబీబీఎస్ పూర్తయిన వెంటనే సివిల్స్ వైపు దృష్టి పెడతానని విశ్వాసం వ్యక్తం చేసింది.

సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు


తహసీల్దార్ మాధవి

నంగునూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సాదాబైనామా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తహసీల్దార్ మాధవి అన్నారు. బుధవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాదాబైనామా కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు నోటీసులు అందజేస్తున్నట్లు తెలిపారు. నంగునూరు మండలంలో 1469 దరఖాస్తులు వచ్చాయని ఇందులో 1270 మంది రైతులకు నోటీసులు అందజేశామన్నారు. పట్టా భూములను సాదాబైనామా కింద కొనుగోలు చేసిన భూములకు సంబంధించి భూమి అమ్మిన, కొనుగోలు చేసిన వారికి సమాచారం ఇస్తున్నామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

కొమురవెల్లి ఇన్‌చార్జి ఏంపీవోగా కరుణాకర్


చిలుక కరుణాకర్

కొమురవెల్లి, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండల ఇన్‌చార్జి ఏంపీవోగా గురువన్నపేట గ్రామ సీనియర్ పంచాయతీ కార్యదర్శి చిలుక కరుణాకర్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏంపీడీవో శ్రీనివాస వర్మ తెలిపారు. మండలంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ పారదర్శకంగా నిర్వహిస్తామని, మండల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని ఈ సందర్భంగా కరుణాకర్ ఓక ప్రకటనలో తెలిపారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. మండలంలోని చంద్లాపూర్‌లో నెలకొల్పిన దుర్గామాత అమ్మవారి ప్రతిమలను బుధవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జడ్పీ మాజీ చైర్మన్ రోజా రాధాకృష్ణశర్మ ఇంట్లో నిర్వహిస్తున్న అమ్మవారి పూజ కార్యక్రమంలో మాజీ మంత్రి పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం చంద్లాపూర్‌కు చెందిన అల్లీపూర్ సొసైటీ వైస్ చైర్మన్ అనుపాటి వెంకట్ రెడ్డి తల్లి ప్రమీల ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సదానందం, బీఆర్ఎస్ నాయకులు రవి, చంద్రమౌళి, వెంకట్ రెడ్డి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు

- బీసీ రిజర్వేషన్లతో ఉలిక్కిపడుతున్న హరీశ్‌రావు
- సిద్దిపేటలో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకుంటాం
- డీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల రాజీవీర్ ముదిరాజ్

సిద్దిపేట రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ గతంలో కంటే సంస్థాగతంగా ఎంతో బలపడిందని, ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని డీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్ ముదిరాజ్ అన్నారు. నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీల జనాభ ప్రకారం దక్కాల్సిన 42 శాతం రిజర్వేషన్‌లను ఎన్నికల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం జరిగిందన్నారు. రిజర్వేషన్లు ఎన్నికల కోసమే కాకుండా సామాజిక హక్కుల కోసమేనన్నారు. రాష్ట్ర జనాభలో ఉన్న బీసీలకు 42 శాతం వాటా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తే సిద్దిపేటలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావుఉలిక్కిపడ్డారనిన్నారు. అందుకోసమే గ్రామాల్లో బిఆర్ఎస్ ఉనికిని కాపాడుకోవడం కోసమే కాంగ్రెస్ బాకి కార్డులను పంపిణి చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఇంటికో ఉద్యోగం, కేజీ టూ పిజీ ఉచిత విద్య, డీగ్రి చదివిన యువతకు నిరుద్యోగ భృతి, దళితులకు ముడేకరాల భూమి, ఇళ్లు లేని వారికి ఇళ్లు, దళిత బంధు, బిసి బంధు, రైతు రూణమాఫీ ఇలా చెప్పుకుంటు పోతే చాలా హమీలు ఉన్నాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోతకి వచ్చి 20 నెలల్లోనే ప్రజలకు ఇచ్చిన హమీలను నేరవేర్చడం జరుగుతుందన్నారు.

తల్లిదండ్రులు దైవ స్వరూపులు

- ప్రముఖ సంఘ సేవకుడు వలస సుభాష్ చంద్రబోస్

కొండపాక,అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు దైవ స్వరూపులని సంఘ సేవకులు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక వలస సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం నెహ్రూ యువ కేంద్ర , సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కొండపాక ఆనంద నిలయంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు దైవ స్వరూపులని ఆయన కొనియాడారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తుంటే 2007 చట్టం 2011 పోషణ చట్టాలు వయోవృద్ధులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. పోషణ సంరక్షణ ఆరోగ్యం పరిరక్షణ తల్లిదండ్రుల బాధ్యత కొడుకులు బాధ్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు లేని మనం ఎక్కడిదని ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని తెలిపారు. సమాజంలో తల్లిదండ్రుల విషయంలో కొన్ని సంఘటనలు చూస్తా ఉంటే చాలా బాధేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను గురువులను నిరంతరంగా పూజించాలని ఆయన పేర్కొన్నారు. చట్టం పోస్టర్ ను ఆవిష్కరించారు. సమావేశం అనంతరం ఆనంద నిలయం వ్యవస్థాపక ఉపాధ్యక్షులు పెద్ది వైకుంఠం ను శాలువాతో సన్మానం చేసి మెమొంటోలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆనంద నిలయం మేనేజర్ పార్థసారథి, రమాదేవి, రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత దొమ్మాట రాజు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

శృంగేరి ఆలయంలో చండీ హోమం


హంస వాహనంపై శారదా మాత

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రం సమీపంలోని శృంగేరి మఠంలో బుధవారం చండీ హోమం వైభవంగా నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హంస వాహనంపై శారదమాతను అలంకరించి కుంకుమార్చనలు, విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా అష్ట హారతులతో అమ్మవారిని పూజించారు. ఈ సందర్భంగా సుహాసిని పూజ ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు వేడుకలో పాల్గొని అమ్మవారికి అర్చన చేశారు. అదేవిధంగా అభిషేక పూజలు అందుకున్న చంద్రమౌళీశ్వర స్వామికి నీరాజనం అర్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటుచేశారు.

ఘనంగా దేవి త్రిరాత్రోత్సవ పూజలు

కొమురవెల్లి, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో దేవి త్రిరాత్రోత్సవాలలో భాగంగా మూడవ రోజు గణపతి పూజ, మండపదేవత ఆరాధన, విశేషంగా చతుష్షష్ట్యుపచార మహాపూజ, మహాకాళి, మహాలక్ష్మీ, మహాసరస్వతి హోమం, మహా పూర్ణాహుతి, అమ్మవారికి విశేషద్రవ్య సమర్పణ, మహామంగళహారతి, మహా మంత్రపుష్ప సమర్పణ పూజలను బుధవారం మల్లన్న ఆలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

దుర్గాదేవిని దర్శించుకున్న సీఐ

చేర్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకునూరు గ్రామంలోని భవాని రుద్రేశ్వరాలయంలో నిర్వహిస్తున్న దేవీనవరాత్రోత్సవాలను పురస్కరించుకుని చేర్యాల సీఐ ఎల్.శ్రీను బుధవారం దుర్గాదేవిని దర్శించుకున్నారు. అలాగే చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలో దుర్గామాతసేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఎస్ఐ నవీన్ పాల్గొనగా, సేవాసమితి అధ్యక్షుడు మన్నె రాజు, ఉపాధ్యక్షుడు బొడిగం రాజేందర్‌రెడ్డి, అజయ్ తదితరులు సత్కరించారు. అలాగే చేర్యాల పట్టణంలోని చావడి వద్ద దేవీస్నేహాయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించగా, చిన్నారులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. స్థానిక వాసవీనగర్‌లో వాసవీ పరపతిసంఘం ఆధ్వర్యంలో హోమం జరిపారు.

నేడు మాంసం విక్రయిస్తే చర్యలు తప్పవు

చేర్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గాంధీజయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ అహింస దినోత్సవం సందర్భంగా నేడు చేర్యాల పట్టణంలో మాంసం విక్రయాలు నిషేధించినందున పట్టణంలోని చికెన్, మటన్, చేపల విక్రయదుకాణాలు మూసివేయాలని మున్సిపల్ కమిషనర్ నాగేందర్ బుధవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు తెరిచి విక్రయాలు చేపట్టిన యెడల చట్టపరచర్యలు తప్పవని తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం


సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్ గ్రామంలో ఇంటింటికి కాంగ్రెస్ బాకీ కార్డులతో బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ చిన్నకోడూరు మండలాధ్యక్షుడు కామిని శ్రీనివాస్ సిద్దిపేట రూరల్ కోనయ్యగారి ఎల్లయ్య ఆరోపించారు. చిన్నకోడూరులో బుధవారం బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కామిని శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలంలోని అయా గ్రామాల్లో, నారాయణరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలలుగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రజలకు బాకీ పడ్డ ప్రతి హామీని, పథకాల పై ప్రజలకు వివరించారు.

శక్తి స్వరూపిణి పాహిమాం... పాహిమాం


వర్గల్ విద్యాధరి క్షేత్రంలో మహిషాసుర మర్దినిగా విద్యా సరస్వతి అమ్మవారు

వర్గల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ విద్యాధరి క్షేత్రంలో విద్యా సరస్వతీ అమ్మవారి శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా బుధవారం విద్యా సరస్వతీ అమ్మవారు భక్తులకు మహిషాసుర మర్ధినిగా దర్శనమిచ్చారు. వేడుకల సందర్భంగా ఆలయంలో ఉదయం ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో విద్యా సరస్వతీ అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం సుగంధ ద్రవ్యావలతో నింపిన 108 కలశాలతో అష్టోత్తర శత కలశాభిషేకం, శంకు పూజలు చేశారు. ఆలయ యాగశాలలో వేద పండితుల వేద మంత్రోశ్చరణల మధ్యన చండీ హోమం చేశారు. ఈ వేడుకలకు భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు అష్టోత్తర శత కలశాభిషేకం పూజలు పాల్గొని పూజలు చేశారు. కలశపూజలు చేశారు.

నిరుపేదలకు సేవ చేయడమే నా లక్ష్యం

- మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్


జంగాపల్లిలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్

రాయపోల్/మిరుదొడ్డి,అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): పేదలకు సేవచేయడం ద్వారానే అసలైన తృప్తి ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ అన్నారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం జంగపల్లి గ్రామంలో దసరా కానుకగా దుస్తులు పంపిణీ చేశారు. అలాగే రాయపోల్ మండలం తిమ్మక్కపల్లి గ్రామంలోని 25మంది వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు.

ప్రతీ పనిలో విజయం సాధించాలి


సాయుధ దళాల కార్యాలయంలో పూజ చేస్తున్న ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్

చిన్నకోడూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : చేసే ప్రతి పనిలో అధికారులు, సిబ్బంది విజయం సాధించాలని ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ ఆకాంక్షించారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులోని సాయుధ దళాల కార్యాలయంలో దుర్గాదేవి అమ్మవారి నవరాత్రులలో భాగంగా బుధవారం ఆయుధాలు, ప్రభుత్వ వాహనాలు, జమ్మి చెట్టుకు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడారు. దుర్గమాత కరుణ కటాక్షాలు పోలీసులకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయ దశమి పండగను జరుపుకోవడం అలనాటి నుంచి వస్తున్న సంప్రదాయమన్నారు. సమాజంలో చెడును పారదోలెందుకు పోలీసు విభాగం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్‌లు పూర్ణచందర్, ఆర్ఎస్ఐలు సాయిచరణ్, సాయి ప్రసాద్, ఏఆర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.